# కత్తిలాంటి వెలుగు రేఖ

వాహిని అంతవరకు అక్క కోసం ఎదురు చూసి, చివరికి కాస్తంత విసుగుచెంది, తను నిరుత్సాహ పడిపోకూడదని, చాపవేసి, తంబుర తెచ్చి పెట్టుకుంది. గాన - భాస్కరం పుస్తకం తెచ్చుకుంటూ తన కృతులు రాసుకున్న పుస్తకం కూడా పెట్టుకుని కూర్చుంది.

నెమ్మదిగా తంబూరా తీగెలు మీటింది. పంచమం సరిగ్గా లేదు. కళ్ళు మూసుకుని తీగెలు శ్రుతి చేస్తూ ఆలోచనలో పడింది. కచ్చేరీ ఇంకా ఇరవై రోజులే వుంది. తను ఎంత సిద్ధంగా వున్నా, అక్క ఎంత క్షుణ్ణంగా సాధన చేసివున్నా, ఇద్దరూ కలిసి పాడటం అనేసరికి ఇద్దరికీ మంచి అవగాహన వుండాలి. ఒకరితో ఒకరు కలిసిపోవాలి. ఒక్కొక్కసారి ఒకరినొకరు అనుసరించాలి. పోటీ కనబరుస్తూనే కలిసి పాడాలి-, శ్రోతల్ని తమతో లాక్కుపోవాలి.

అన్నితీగెలూ చక్కగా శ్రుతిలో మోగుతున్నాయి. కొంతసేపు తంబుర మీటుతూనే వుండిపోయింది వాహిని. నెమ్మదిగా 'సా' అంటూ కళ్ళు మూసుకుని తంబురులోగొంతు కలిపింది. ఏవేవో ఆలోచలను మనసులో కదులుతూ, ఏవో దృశ్యాలు మెదులుతున్నాయి. 'పా' అంటూ ఏకాగ్రతతో అరనిమిషం పంచమంలో నిలిచి వుండిపోయింది-, పై షడ్జమం దగ్గరకెళ్ళి మరో నిముషం గొంతు కలిపింది. నెమ్మదిగా కంఠంలో వుండే, గస తగ్గి తీగెలా తంబుర శ్రుతిలో లీనమైపోయింది.

సరిగ్గా అప్పుడే తలుపు చప్పుడైంది. కళ్ళు తెరిచి చూసిన వాహినికి లోపలికి అడుగు పెడ్తూన్న వర్షిణి కనిపించింది. ఆమె ముఖం బాగా వాడిపోయి, నల్లగా మాడిపోయినట్లుంది. చటుక్కున అక్కను చూసి నవ్వను కూడా నవ్వలేకపోయింది వాహిని.

వస్తూనే వర్షిణి కుండలో నీళ్ళు ముంచుకుని గటగటా తాగేసి కొంగుతలో ముఖం తుడుచుకుంటూ చెల్లెలి పక్కకొచ్చి కూర్చుంటూ చేతిలో వున్న బ్యాగ్ ఓ పక్కన పడేసింది.

ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకోలేదు. తంబుర తీగెలు మంద్రంలో, మధురంగా మోగుతూనే వున్నాయి.

"కాస్త కాఫీ కలపమంటే..." అంది వాహిని.

"ఊ" అంది అక్క.

లోపలికెళ్ళి కాఫీ కలుపుతూ ఆలోచనలో పడింది. ఇంత అలసటగా వున్న అక్కతో సంగీత సాధన ఎలా మొదలు పెట్టాలి? అసలు అక్క ముఖం చూస్తే, తనకున్న ఉత్సాహం కూడా నీరుగారిపోయింది. అయినా ఏమైంది దీనికి? కేవలం వుద్యోగానికి వెళ్ళడం వల్లనేనా? లేక లోపలేమైనా బాధ వుందా?

కాఫీ గ్లాసు అందిస్తూ "ఇరవై అయిదు ప్రోగ్రామ్ కన్‌ఫరమైంది. మనం ప్రాక్టీసు మొదలు పెట్టాలి" అంది.

వర్షిణి కాఫీ అందుకుని ఏం మాట్లాడకుండా నెమ్మదిగా కొంచెం తాగి "అమ్మయ్య, కాఫీ చాలా బాగుందే... పంచదార కరెక్ట్‌గా వేశావు" అంది.

తను మాట్లాడినదానికి సమాధానమివ్వకుండా మాటమార్చిన అక్కను చూసి కొంచెం ఆశ్చర్యపోయినా మూడ్ మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తోందని అర్థం చేసుకుంది.

❖ ❖ ❖

దేవరకొండ రామచంద్ర శర్మగారికి ఆ చుట్టుపక్కల నుంచి సంగీత విద్వాంసులుగా పేరుంది. ఆయన పెద్ద పెద్ద కచేరీలు చేసి జాతాయ స్థాయిలో పేరు గడించకపోయినా ఆ చుట్టుపక్కల ఎవరినోట శాస్త్రీయ సంగీతం గురించి మాటలు వచ్చినా మొదటగా శర్మగారి పేరు చెప్పుకుంటారు. ఏ చిన్న ఉత్సవం జరిగినా ఆయనొక అరగంటైనా పాడకుంటే విడిచిపెట్టరు. అంతకంటే ఆయనకు మంచి గురువుగా, సంగీత శాస్త్రాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్న పండితునిగా పేరుంది. ఆయన ఇంట్లో స్థాపించిన 'స్వరార్ణవం'లో ఎందరో పిల్లలు వచ్చి సంగీతం నేర్చుకుంటూ వుంటారు. ఆయనకి నలుగురాడ పిల్లలు. ఒక్కడే చివరగా మగ పిల్లవాడు. ఆడపిల్లలు నలుగురూ చక్కగా పాడతారు. చివరి ఇద్దరూ మరీ గొప్పగా పాడగల సామర్థ్యమున్న

వారు. వాళ్ళ కంఠాలు కూడా శ్రావ్యంగా వుంటాయి. ఇద్దరూ కలిస్తే, అందరూ ఆశ్చర్యచకితులై వినేలా పాడేయగలరు. శర్మగారు తన కూతుళ్ళ ప్రతిభ గుర్తించి వారికి మంచి శిక్షణ కూడా యిచ్చారు. ఆడపిల్లల నలుగురికీ సంగీతరాగాల పేర్లు పెట్టి నలుగురిలో గర్వంగా చెప్పుకుంటూ వుంటారు. పెద్దమ్మాయి భైరవి, రెండో పిల్ల కల్యాణి సంగీతంలోనే డిప్లమోలు చేసి ఉద్యోగాలు చేసుకుంటూ పెళ్ళిళ్ళు చేసుకుని సుఖంగానే కాపురం చేసుకుంటున్నారు.

మూడు నాలుగూ అమృతవాహిని, అమృత వర్షిణి చిన్నప్పటి నుండీ కలిసే ప్రోగ్రాములివ్వడంలో శిక్షణ పొంది అమృత సిస్టర్స్ అని, బొంబాయి సిస్టర్స్ లాగా రాధాజయలక్ష్మి లాగా చక్కనిపేరు సంపాదించారు.

తండ్రి ఆశకు అనుగుణంగా ఆ అక్కా చెల్లెళ్ళు అత్యంత ఉత్సాహంగా సంగీత సాధనలో లీనమైపోయి ఉన్నారు. ఒక్కొక్కసారి వాళ్ళు అన్నం కన్నా, నీళ్ళ కన్నా సంగీతమే ముఖ్యంగా మెలుగుతూ ఉంటారు.

అలాంటి సమయంలో వారిలో పెద్దపిల్ల అమృతవర్షిణిని ఏరికోరి పెళ్ళి చేసుకోవడానికి కృష్ణమూర్తి వచ్చాడు. శర్మగారికి అప్పుడే కూతురి పెళ్ళి చేయడం ఇష్టం లేకపోయినా, భార్యా, పెద్దకూతుళ్ళూ పంతం పట్టుకుని కూర్చుంటే ఒప్పుకోక తప్పింది కాదు.

కృష్ణమూర్తి బ్యాంకులో మంచి ఆఫీసరు హోదాలో ఉన్నాడు. సంగీతమంటే విపరీతమైన ఇష్టం. పాట వింటూ ప్రాణం విడవమన్నా విడుస్తానంటాడు. అమృత వర్షిణి పెళ్ళైనా, పాటకీ, కచేరీలకు వెళ్ళడానికి, సాధన చెయ్యడానికి ఆమెకెలాంటి ఆటంకాలు ఉండబోవనే హామీ మీదనే పెళ్ళి జరిగింది.

వర్షిణి మెత్తని మనుసున్న పిల్ల. కరుకుగా మాట్లాడలేదు. దేన్నీ పోట్లాడి సాధించుకోలేదు. ఆ విషయంలో వాహినికి వేగం ఎక్కువ. ఏం చెప్పినా ఖచ్చితంగా చెప్తుంది. దేనికీ జంకూబొంకూ ఉండదు. ఈ విరుద్ధ లక్షణాల వల్ల, వాళ్ళూ కలిసి పాట కచేరీ చేసేటప్పుడు చక్కగా బ్యాలన్స్ కుదిరి కచ్చేరీ రక్తి కట్టేది. ప్రతిభలో తేడా లేకపోయినా, దాన్ని ప్రదర్శించటంలో భేదం కనిపించటం వల్ల వాహిని ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

పెళ్ళయినా ఇద్దరూ కలిసి ప్రోగ్రాములివ్వడం సహజంగానే జరుగుతూ ఉంది. ప్రోగ్రాము పూర్తవగానే వర్షిణి కంటే వాహినికి ఎక్కువ అభినందనలు రావడం –

ఎక్కువ మంది వచ్చి పలకరించడం మాట్లాడటం జరుగుతూ ఉంటుంది. ఇది ముందునుంచీ తెలిసిన కుటుంబ సభ్యులు సహజంగానే తీసుకున్నా కృష్ణమూర్తికి ఏదో లోపంలా బాధగా అనిపించేది.

కీర్తి రావడం విషయంలో నెట్‌వర్క్ ఉండాలని ఆశించే వ్యక్తి కృష్ణమూర్తి. వర్షిణీ మాత్రం తన పాటమీదే మనసు నిలుపుతుందిగానీ మరేం పట్టించుకోదు. భార్య కీర్తి తనది గానే భావించి, ఎవరికెక్కువ అప్లాజ్ వస్తోందో గ్రహించి ఒకటే బాధపడటం మొదలుపెట్టాడు.

"పాట పాడేయగానే సరేనని కూర్చుంటే ఎలా? కాస్త ఉషారుగా నవ్వుతూ ఉండాలి" అంటూ మొదలు పెట్టేవాడు.

భర్త మాటలు, అందులోని భావం వర్షిణికి చిరాకుగా అనిపించేది. కానీ గట్టిగా ఎదిరించి మాట్లాడటానికి జంకుగా ఉండేది. మనసులోని మాటకూడా భర్తతో నిర్భయంగా చెప్పకూడదనే సంస్కృతి ఆమెని కట్టిపడేసేది. ఏదో ఒకటి చెప్పి తప్పించుకునేది. కానీ అతని మాటలామెకి చాలా చికాకుగా అనిపించేవి.

కృష్ణమూర్తి విచిత్రమైన వ్యక్తి. ఇంట్లో పనంతా తనే చేసుకుపోయే వాడు. ఏ మాత్రం విశ్రాంతిగా వర్షిణీ కనిపించినా ఊరుకునేవాడు కాదు. "అలా ఖాళీగా కూర్చోకపోతే సాధన చేసుకోరాదూ, నాట రాగంలో నీ కంటే వాహిని చాలా బాగా ఉంది" అనే వాడు. అలా అంటూ ఇంట్లో బట్టలు దగ్గర్నించీ ఉతికి ఆరేసేవాడు. వంట చేసి పెట్టేవాడు.

"పాటపాడేవాళ్ళు లంగ్స్ శ్రమపడే పనులు చేయకూడదు" అంటూ బోధనలు చేసేవాడు. పనిమనిషి దగ్గర తనే ఉండి పని చేయించేవాడు. ముసలితల్లికి అన్నం తనే వడ్డించేవాడు. ఆమెకి కావలసినవన్నీ తనే చూసేవాడు. చూసే వాళ్ళకి ఇవన్నీ చాలా అపురూపంగానే కనిపించేవి.

"వాడుట్టి పిచ్చి సన్నాసి. సంగీతమంటే వల్లమాలిన యిష్టం. అందుకే అడ్డమైన చాకిరీ చేస్తున్నాడు" అనేది. అతనితల్లి ఆమెకి ఇంట్లో పని మగవాడు చేయడం చిన్నతనంగా ఉండేది. ఆమె మాటలు వర్షిణికి బాధ కలిగించేవి. అతనేమో ఏదైనా చెప్తే వినేవాడు కాదు. తల్లి ఏదైనా అన్నట్టు తెలిసిందా, ఆమెని కాల్చుకు తినేసేవాడు. అతను లేనప్పుడు అత్తగారి దగ్గర కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పి కన్న కూతురిలా ప్రవర్తించేది వర్షిణి.

"వాడుట్టీ మూర్ఖుడు వాళ్ళ నాన్న లాగా – ఏదైనా పట్టుకుంటే అదే – నేనేం అనుకోనులే –, నవ్వు నాకేం చెయ్యడం లేదని–" అనేది.

ఆ మాటలకి వర్షిణీ ఆనందపడి పోయేది. మొగుడి దగ్గర కన్నా అత్తగారి దగ్గరే చనువుగా, సుఖంగా ఫీలయ్యేది.

❖ ❖ ❖

రెండేళ్ళలో పరిస్థితి చాలా మారిపోయింది. వర్షిణీ ఒక పిల్లాడికి తల్లయింది.

కడుపు–పురుడు– పిల్లాడు కాస్త బలహీనత – వీటివల్ల వాహిని కంటే కొంత వెనకబడింది. దానితో కృష్ణమూర్తి సాధింపు పెరిగిపోవడం మొదలైంది. వర్షిణీ పాట తన పాటేనన్నట్లు, ఆమె పేరు తన పేరేనన్నట్లు, ఆమెకి చేజారిపోతున్న డబ్బు తనదే పోతున్నట్లు బాధపడిపోతూ, ఆమె కీర్తి ఏ మాత్రం తక్కువ వచ్చినా సహించ లేనట్లు, ఏదో ఒకటి చెయ్యాలంటూ లెక్చర్స్ ఇవ్వడం – సూటీపోటీ మాటలతో అవమానించడం ఎక్కువైపోయింది.

"సంగీతమంటే తపస్సండీ, అది ఉత్తినే ఈజీగా రాదండీ' అంటూ అందరితో ఫిర్యాదు చేస్తున్నట్లు మాట్లాడ్డం మొదలు పెట్టేవాడు.

"ఎలాగైనా వర్షిణికి శ్రద్ధ తక్కువ" అంటూ ముగించేవాడు. అతన్ని చూసి అందరూ అలాంటి మనిషి భర్తగా దొరకడం అదృష్టమనీ, అపురూపమనీ – కేవలం కళారాధన కోసమే అతను పుట్టాడనీ పొగిడేవారు. భార్య గురించి అంత శ్రద్ధ వహించే వారు అరుదని సర్టిఫికేట్ ఇచ్చివదిలేవారు. మరీ చనువున్న వారైతే వర్షిణీతో అతని మాట నీకు వేదవాక్కు సుమా అని హితవు చెప్పేవారు.

వర్షిణి దగ్గర వీటికి సమాధానాలూ, సమర్థింపులూ, వ్యతిరేకించటాలూ – వేటికీ మాటలుండేవి కావు. అతని మాటలు, చూపించే శ్రద్ధా చాలా కలవరంగా అనిపించేవి. కానీ ఎవరితోనూ చెప్పుకునేందుకు కూడా వీలుండేది కాదు. కన్నతల్లి కూడా " ఏమన్నాడే అతను. సంగీత సాధన గురించేగా" అని కొట్టిపారేసేది.

ఇదే సమయంలో వాహినికి విడిగా కచ్చేరీల ఆఫర్లు చాలా వచ్చాయి. ఆమె తండ్రితో కలిసి వెళ్ళి పాడి రావడం, బాగాపేరు, డబ్బూ వస్తూండటం కృష్ణమూర్తికి బెంగగా అనిపించేది.

అప్పుడప్పుడు వాహిని పెళ్ళి ప్రసక్తి ఇంట్లో వస్తూండేది. అప్పుడు శర్మ "వర్షిణి మొగుడు మూర్తి ఎంతో మంచివాడు కనకు సరిపోయింది. దీనికలాంటివాడు వస్తాడా అని నాకు బెంగగా ఉంటుంది" అని వాపోయేవాడు.

వివాహం - కళ అనే రెండు విషయాలు ఎలా ముడిపెట్టాలో తెలీక ఆ పెద్దాయన తికమక పడేవాడు. పైగా వాహిని మంచి గుర్తింపు పొంది పైకి వస్తున్న ఆర్టిస్టు. ఇప్పుడు పెళ్ళి అనేది పెద్ద మలుపు. అదెలాంటి మలుపవుతుందో చెప్పడం కష్టం. చాలామంది సంగీతం పట్ల, కళ పట్ల ఎంతో ఆరాధన ఉన్నట్లు కనబడతారు. మాట్లాడుతారు. కానీ ఇంట్లో వాళ్ళు అలాంటి వ్యాపకంలో ఉండి, కృషి మొదలు పెడితే సహించలేక పోతారు. మగవాడి కళారాధన మగవాడి మీదనే ఆధారపడి ఉంటుంది. కానీ ఆడదాని కళారాధన మగవాడి మీద ఆధారపడి ఉంటుంది. మగదృష్టితో చూసే సమాజం మీద ఆధారపడి ఉంటుంది. కళారాధన కోసం స్త్రీలను విభజించి, వేరే జట్టు కట్టించిన సంప్రదాయం మనది. ఒక మగవాడి అండదండలతో ఏ కళలోనైనా రాణించాలి స్త్రీ - అతను తండ్రైనా, భర్త, అన్న ఎవరైనా - ఇదీ సమాజంలో శిలాశాసనమై నిలిచిపోయింది. దానికనుగుణంగా జీవితాన్ని మలుచుకుంటూ, వారి అభిరుచులకనుగుణంగా కళారాధన చెయ్యాలి స్త్రీలు.

వాహినికి పెళ్ళిమీద ధ్యాసలేదు. అలాగని పెళ్ళి చేసుకోకూడదనే గట్టి ఆలోచనా లేదు. బాగా పేరు ప్రఖ్యాతులు గడించాలని విపరీతమైన కోరిక ఉంది. పాట పాడుకుంటూ కూర్చుంటే అన్నం, నీళ్ళు అక్కరలేదనిపిస్తుంది. కానీ, మగాడు లేకుండా ఆడదెలా బతకగలదు! అనే భయం కూడా ఆమెకుంది.

"గణపతి ప్రార్థన నాట పాడదాం" అంది వాహిని

"ఏం? వాతాపి వద్దా?"

"అబ్బ! ఎప్పుడూ అదేనా. నేను లిస్ట్ తయారుచేశాను. మన కచ్చేరీ స్థాయి పెరగాలి".

వర్షిణీ చెల్లెల్ని చూస్తోంది. కానీ ఆ కళ్ళు గాజు కళ్ళు. ఆ చూపులు శూన్య దృక్కులు.

"ఆట తాళ వర్ణం - నాట రాగం - పెద్ద రాగంగా శంకరాభరణం" ఇలా చెప్పుకుంటూ పోతోంది వాహిని. కొంత సేపటికి అక్క వినడం లేదని గ్రహించి "ఏమిటే... " అని దీర్ఘం తీసింది.

"ముఖారి వద్దా" అంది వర్షిణీ.

వాహిని చేతిలో కాగితం విసిరికొట్టింది.

"నీకస్సలు ఇంట్రస్ట్ లేదు" అంటూ చాప మీద వొరిగిపోయింది. అప్పుడు వర్షిణీ కళ్ళు వర్షించటం మొదలు పెట్టాయి. అక్కని చూసి బెంబేలు పడి పోయింది వాహిని. ఆమెని గట్టిగా పొదివిపట్టుకుని.

అక్కా! అక్కా! ఏమైందే. నీకు ఇంట్రస్ట్ లేదన్నందుకే ఇంత ఏడుపా? అంటూ కుదిపేసింది.

వర్షిణి ఏడుపు మరీ ఎక్కువైంది గానీ తగ్గలేదు. ఆమె వెక్కిళ్ళతో ఏడుస్తూనే ఉండిపోయింది. ఏదో పెద్ద వ్యవహారమే ఉందని గ్రహించి వాహిని అచేతనంగా అక్కవైపు చూస్తుండిపోయింది. ఒక అయిదు నిముషాలలో గుండెలు పగిలిపోయేలా ఏడ్చాక నిమ్మళించింది.

"వాహీ! తలుపు గట్టిగా వేసిరా" అంది. గొంతూ ముక్కూ మూసుకుపోయి మాట పెగలనట్టుగా ఉంది.

వాహిని గుండె దడదడలాడిపోయింది. అసలేమైందే? బావ ఏమైనా అన్నారా? అతనేమంటాడు? మహా అయితే మరో గంట సంగీత సాధన చెయ్యమంటాడు. దానికి తనూ బాధ పడదుగా? మరేమిటీ –

ఆలోచిస్తూనే తలుపు గట్టిగా వేసి, కిటికీ కూడా మూసి అక్కదగ్గరగా వచ్చి కూర్చుంది. వర్షిణి రెండు చేతులూ చెల్లెలు మెడచుట్టూ వేసి, ఆమె గుండె మీద వాలిపోయి. నెమ్మదిగా, అతినెమ్మదిగా గుసగుసలాడుతున్నట్లు వాహిని గుండెల్లో చలి పిడుగులాంటి మాటలు చెప్పింది.

వాహినికి ఒక్క క్షణం తనేంవింటోంది అర్థం కాలేదు. అది అర్థమవుతూ నెమ్మదిగా తాచు పాము విషం నరాల్లోకి పాకినట్లు బాధతో, భయంతో విలవిల్లాడిపోతూ అలాగే ఒరిగిపోయింది.

అమెని గట్టిగా పొదివి పట్టుకుని మళ్ళీ వర్షిణి కన్నీళ్ళు కారుస్తూ నిస్తేజంగా ఉండిపోయింది.

❖ ❖ ❖

రామచంద్రశర్మ ఆ చీకటి గదిలో మంచం మీద పడుకుని ఆవేదన పడుతున్నాడు. డెబ్బైయేళ్ళు పైబడి, ఎంతో అనుభవం గడించాననుకునే అతనికి ఈ సమస్య ఎదుట నిలబడింది. ఇదేమంత కొత్త సమస్య కాదు. ప్రపంచంలో అనూహ్యమైనదీ కాదు. కానీ తన జీవితంలో తనే ఇలాంటి ఒక సంఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని అతననుకోలేదు. అతని గుండెలు గుబగుబలాడుతున్నాయి. ఎప్పటివో సంఘటనలు, అసహ్యకరమైన జ్ఞాపకాలు అతన్ని వెన్నాడుతున్నాయి.

అతను పదేళ్ళ కుర్రాడుగా ఉన్నప్పుడు అమ్మని, పెద్దమ్మనీ నాన్న స్థంభానికి కట్టి చచ్చేట్టు కొట్టాడు. ఆ నాటి విషయం పూర్తిగా అర్థం చేసుకోలేని శర్మ తల్లిని వాటేసుకుని ఏడ్చాడు.

వయసు పెరిగే కొద్దీ చుట్టూ ఉన్న సమాజమే అన్నీ అర్థయయేలా విడమర్చి చెప్తుంది. పసిహృదయం బాధ పడుతుందని కానీ, భయపడుతుందని గానీ అది వెరవదు. అదేదో గుండెల మీద భారంగా, దాన్ని దించుకోవడమే కర్తవ్యంగా భావిస్తుంది కాబోలు.

రామచంద్రశర్మ తండ్రికి ఇద్దరు భార్యలు – ఇద్దరు అక్క చెల్లెళ్ళు – అక్కగారికి పురిటి సమయంలో సహాయంగా వుండటానికి వచ్చిన మరదల్ని నోరునొక్కి అనుభవించి తెల్లారి ఆ మరదల్ని తను ద్వితీయంగా స్వీకరించనున్నట్లు మామగారికి కబురు పంపిన ఘనుడు శర్మ తండ్రి. గంపెడు ఆడపిల్లలున్న తండ్రి ఒక్క పిల్లకి మాత్రమే పెళ్ళి చేయగలిగిన అర్భకుడు, జరిగిన అప్రతిష్ఠని ఎదురుగా చూసే శక్తి లేక నోరుమూసుకుని రెండో కూతుర్ని కట్టబెట్టాడు –, అంతవరకు ఎంతో ప్రేమగా వుండే ఆ అక్కాచెల్లెళ్ళు ఆ నాటి నుండి బద్ధశత్రువులై పోయారు. అక్కగారి దెప్పుళ్ళతో, తిట్లతో, శాపనార్థాలతో గడిచే తల్లి జీవితం మీద ఆమెకే మాత్రం ఆసక్తి లేదని శర్మ గ్రహించటానికి అతని పిన్న వయసే పెద్ద బుద్ధినిచ్చింది. నరకం లాంటి ఆ యింట్లో, సంగీత సరస్వతి మాత్రం సుస్వర రాగాలు తీస్తూ వుండేది–, పెద్దావిడకి నలుగురు పిల్లలు చిన్నావిడకి ఇద్దరు పిల్లల్ని ప్రసాదించాడా పురుషోత్తముడు–, చిన్నావిడ కొడుకు శర్మ అవమానాలతో పెరుగుతూనే అనన్యమైన సంగీత జ్ఞానాన్ని సంపాదించు కున్నాడు. తల్లి చక్కగా పాడుతూ కొడుక్కీ కూతురికీ అన్నీ నేర్పేది. అదే ఆమెకున్న ఒకే ఒక మనశ్శాంతి.

శర్మ పక్కకి ఒత్తిగిల్లాడు వెచ్చగా కన్నీరు చెంపల మీద దొర్లింది. ఆ కాలం వేరు. ఆనాటి పరిస్థితులు వేరు. అప్పటి బ్రాహ్మణ కుటుంబాల పరిస్థితి వేరు. పాండిత్యమెంత వున్నా, దాన్ని మించిన అహంకారం, కళని ఆరాధించటం వున్నా, పోషించే వారు లేక నిత్య దారిద్ర్యంతో కోపాలతో తాపాలతో అజ్ఞానంతో అలమటించిన ఆ తరంలో స్త్రీగా పుట్టి, తనకంటూ ఒక మార్గం, తన ప్రతిభను ప్రకటించే వీలు ఎవ్వరికీ సాధారణంగా వుండేవి కాదు. అన్నిటికీ మించి ఆర్థిక స్థితి అందర్నీ కృంగదీసి, పుట్టిన ప్రతీ ఆడపిల్లా చచ్చిపోతే బాగుండుననుకునే కాలం. కానీ ఇప్పుడు కాలం

మారింది. సమాజం మారింది. సంగీతానికి, సాహిత్యానికే కాదు కళలకు ఒక గుర్తింపు పొందే కొంత వెసులుబాటు వచ్చింది. కానీ మగవాడి ఆలోచనలో మార్పులేదు. మగవాడు స్త్రీని చూసే దృష్టిలో పూర్తి మార్పు రాలేదు. అదే వచ్చినట్లయితే కృష్ణమూర్తి వాహినిని కూడా తానే పెళ్ళాడతాననీ, ఇద్దరూ అక్క చెల్లెళ్ళు ప్రేమానురాగాలతో, సంగీత రాగాలు మేళవించ వచ్చుననీ, వారిద్దరి కెరీర్ తను చూసుకుంటాననీ అనగలిగేవాడు కాదు. అలాంటి వుద్దేశం వ్యక్తం చెయ్యడమే కాకుండా, వాహినే ఇష్టపూర్వకంగా ఈ పెళ్ళికి సిద్ధపడేలా చెయ్యమని వర్షిణీ మీద ఒత్తిడి తీసుకురావడం హత్యకంటే పెద్ద దుర్మార్గం. వర్షిణి కుప్పకూలిపోయింది. వాహిని కంగారు పడిపోయింది. ఈ ప్రతిపాదన వెనుక వర్షిణికి బెదిరింపు కూడా వుంది. విడిచి పెట్టేస్తాననీ, జీవితాలు ఛిన్నాభిన్నమయిపోతున్నప్పుడు, సంగీతం, నృత్యం, సాహిత్యం, ఏ కళైనా పక్కకెళ్ళిపోతుందనీ, సహజంగా జీవితంలో సుఖశాంతులైనా వుండాలి. లేదా పోరాడి సాధించగల ఓపికా, ధైర్యమైనా వుండాలి. అప్పుడే కళకో గుర్తింపు వస్తుందనీ చెప్పాడు.

ఎవరో తలుపు నెమ్మదిగా తీసిన చప్పుడైంది. ఆ చప్పుడుతో బాటుగా కత్తిలాంటి ఒక వెలుగురేఖ లోపలికి వచ్చింది. ఎన్ని గంటలలా చీకటి గదిలో పడుకున్నాడో అతనికే తెలీలేదు.

"నాన్నా!" తంబురలోని మంద్రతీగ కదిలినట్లు – అవును. అది వర్షిణి గొంతు.

రామచంద్రశర్మ పక్కకి తిరిగి చూశాడు. అంత చీకటిలోనూ వర్షిణి సన్నని మెరుపు తీగలాగ వుంది.

"నన్ను మీ శిష్యురాలిగా స్వీకరించండి. ఇంక నాకు సంగీతం తప్ప వేరే జీవితం వద్దు నాన్నా!" తలొంచుకుని అంది.

శర్మ లేచి కూర్చున్నాడు "చంటాడేడి" అన్నాడు నెమ్మదిగా.

"నాతో నేనేం తీసుకురాలేదు. కేవలం మీ కూతురుగా వచ్చా"

వెంటనే ఆ తండ్రి ఏదో అనబోయి ఆగాడు. గుమ్మం దగ్గర తచ్చాడుతున్న వాహిని కనిపించింది.

"వాహీ! అక్కని జాగ్రత్తగా కనిపెట్టుకుని వుండు" అన్నాడు. వాహిని లోపలికి వచ్చింది. ఆ చీకట్లో కూడా ఆమె కళ్లు మెరుస్తున్నాయి.

(5-3-99 ఆంధ్రజ్యోతి వీక్లీ)